


ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కుమ్రం భీం ఆదివాసీ భవన్‌లో జరిగిన వేడుకల్లో కళాకారుల నృత్యప్రదర్శన


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 10 ఆగస్టు 2024 | HYDERABAD




శుక్రవారం నాగుల పంచమి సందర్భంగా నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

# రసాయన నిల్వలుంటే..

**18005990099 లేదా 040-2956 0509కు కాల్ చేయండి**

**హైడ్రా కమిషనర్ రంగనాథ్ సూచన**

సిటీబ్యూరో, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ ) : జనావాసాల మధ్య ప్రమాదకర రసాయాలను అక్రమంగా నిల్వ చేస్తే.. కఠిన చర్యలు తప్పవని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. బోయిగూడ స్క్రాప్‌గోడౌన్, సికింద్రాబాద్ రూబీ హోటల్, సికింద్రాబాద్ దక్కన్ కార్పొరేట్ నిట్‌వేర్, సికింద్రాబాద్ స్వప్న లోక్‌కాంప్లెక్స్, నాంపల్లి బాలాజీ రెసిడెన్షియల్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మొత్తం 53 మంది వరకు చనిపోయారని గుర్తు చేశారు. ఔటర్ రింగు రోడ్డు లోపల ఉన్న నివాస భవనాల మధ్యలో ప్రమాదకర వస్తువులు అనధికార, అక్రమ నిల్వ కార్యకలాపాలు జరుగుతున్నట్లు తమ దృష్టి వచ్చిందని, కచ్చితంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టి చర్యలు చేపడతామన్నారు. ఎక్కడైనా అక్రమ రసాయన నిల్వలుంటే.. 18005990099 లేదా 040-2956 0509 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. కమిషనర్‌కు వ్యక్తిగతంగా కలుసుకుని ఫిర్యాదు చేయాలనుకునే వారు ముందుగా అపాయింట్‌మెంట్ 72079 23085 నంబర్‌కు మెసేజ్ చేస్తే చాలన్నారు.

# సైబర్ మోసం




సిటీబ్యూరో: 'మీ ఫోన్ నంబర్‌తో ఢిల్లీకి డ్రగ్ సరఫరా అవుతున్నాయి.. మిమ్మల్ని విచారించాలి.. అందుకు ఆర్బీఐ అకౌంట్‌కు మీ ఖాతాలోని డబ్బులన్నీ బదిలీ చేయాలి' అంటూ 80 ఏండ్ల వృద్ధురాలిని బెదిరించిన సైబర్‌నేరగాళ్లు..లక్షలు కాజేశారు. పోలీస్ కమిషనర్‌నంటూ.. బాధితురాలికి ఫోన్ చేసిన ఆగంతకులు.. 'ఢిల్లీకి సరఫరా అవుతున్న పార్సిల్‌పై మీ ఫోన్ నంబర్ ఉంది.. విచారణ అనంతరం దోషులను గుర్తుపడుతాం'. అంటూ నమ్మించి.. రూ. 22 లక్షలను తమ ఖాతాల్లోకి బదిలీ చేసుకున్నారు.

## భయపెట్టి..

దావూద్ ఇబ్రహీం గ్యాంగ్‌తో మీకు సంబంధాలున్నాయి.. మీపై అరెస్ట్ వారెంట్ జారీ అయ్యింది'..అంటూ ఓ ప్రభుత్వ ఉద్యోగం చేసే 60 ఏండ్ల వ్యక్తిని భయాందోళనకు గురిచేసి..దోచేశారు సైబర్‌నేరగాళ్లు. బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేస్తామం'టూ.. బెదిరించారు. తన కొడుకు పెండ్లి కోసం దాచిన డబ్బులను ఫ్రీజ్ చేయవద్దంటూ..బాధితుడు వేడుకున్నాడు. అయితే మీ డబ్బును తీసుకోం.. ఎస్ఎస్ఏ లోకి బదిలీ చేస్తామని, స్క్రూటీని తరువాత మీకు ఆ డబ్బు వాడుకునేందుకు ఆర్థిక శాఖ అవకాశమిస్తుందంటూ నమ్మించి..రూ. 21 లక్షలు అపహరించారు.

# దాడి..ప్రతిదాడి..

## బాలాపూర్‌లో రక్తపుటేరులు

- వరుసగా రౌడీషీటర్ల హత్యలు
- తుపాకీ, కత్తులతో వెంటాడి హతమారుస్తున్న గ్యాంగ్‌లు
- తాజాగా మరో రౌడీషీటర్ మర్డర్

***దాడులు..** ప్రతి దాడులతో బాలాపూర్ ప్రాంతం దద్దరిల్లుతున్నది. తుపాకులు, కత్తులతో రౌడీషీటర్లు ఒకరిపై మరొకరు దాడులు చేసుకుంటున్నారు. తాజాగా రియాజ్ అనే రౌడీషీటర్‌పై ప్రత్యర్థులు తుపాకీతో కాల్పులు జరిపి హతమార్చిన ఘటన సంచలనం సృష్టించింది. జనవరి, ఫిబ్రవరి నెలల్లో బాలాపూర్, పహాడీషరీఫ్ ప్రాంతాలు రౌడీషీటర్ల హత్యలతో అట్టుడికింది. కొన్నాళ్లు స్తబ్దుగా ఉన్నా.. తాజాగా రియాజ్ హత్యతో మరోసారి కలకలం రేగింది. ఇలా వరుస ఘటనలు స్థానికులను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. పోలీస్ ఉన్నతాధికారులు రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపుతున్నామని చెబుతున్నారు. వారికి కౌన్సెలింగ్ సైతం ఇస్తున్నా.. తీరు మారడం లేదు. రౌడీషీటర్ల మధ్య పరస్పర దాడులు, ప్రతీకార హత్యలతో రక్తపుటేరులు పారుతున్నాయి.*

*- సిటీబ్యూరో/బడంగ్‌పేట, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ)*



గ్రేటర్‌లో సుమారు 1950 మంది రౌడీషీటర్లు ఉన్నారు. ఇందులో సగానికి సగం మంది రౌడీయిజానికి దూరంగా ఉన్నా.. మిగతా వారు మాత్రం వృత్తి మానడం లేదు. రౌడీయిజమే తమకు ఒక హోదాలాంటిదనే భ్రమలో తిరుగుతూ.. నేరాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కొందరు రౌడీషీటర్లు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. దౌర్జన్యాలు ఎక్కువ కావడం..మరో రౌడీషీటర్ ముఠాతో గొడవలకు దిగుతుండటంతో తాడోపేడో తేల్చుకోవాలని ఇరువైపులా ముఠాలు ఎత్తులకు పై ఎత్తులు వేసుకుంటున్నాయి. ఇందులో ఒకరు ఎత్తు వేసే వరకు.. మరొకరు దానిని గుర్తించి.. అవతలి వారినే ఖతం చేసే కుట్రలకు తెరలేపుతున్నారు. రాత్రి వేళల్లోనే రౌడీషీటర్లు తమ ముఠాలతో సమావేశాలు ఏర్పాటు చేసుకుంటూ..నేరాలకు స్కెచ్ వేస్తున్నారు. తమ ప్రత్యర్థులను ఎదుర్కొవడం కోసం కత్తులు, తుపాకులను సైతం అక్రమంగా సేకరిస్తున్నారు. ఇందుకు యూపీ, బీహార్ వంటి ప్రాంతాలకు వెళ్లి.. అక్రమంగా ఆయుధాలను సైతం సమకూర్చుకుంటున్నారు. తాజాగా బాలాపూర్‌లో దారుణంగా హత్యకు గురైన రౌడీషీటర్ రియాజ్‌ను తుపాకులతో వెంటాడిన ప్రత్యర్థులు.. పక్కా ప్లాన్‌తోనే హతమార్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఒక రౌడీషీటర్ హత్యకు గురయ్యాడంటే.. దానికి ప్రతీకారంగా మరో హత్య జరగడం ఖాయమవుతుంటుంది. ఇందుకు రోజులు, నెలల తరబడి కూడా సమయం కోసం గ్యాంగ్‌లు ఎదురు చూస్తూ అవకాశం చిక్కగానే తమ పగను తీర్చుకుంటున్నాయి.

### విచక్షణారహితంగా..

జనవరిలో రౌడీషీటర్ ముబారక్‌ను ఓ గ్యాంగ్ చుట్టుముట్టి కత్తులతో విచక్షణారహితంగా హత్య చేసింది. మృతుడిపై 23 కేసులున్నాయి. గుర్రం, బైక్ కొని డబ్బులు అడిగితే ఇవ్వకపోవడంతో ప్లాన్ ప్రకారం దారుణంగా హతమార్చారు. అదే నెలలో పహడీ షరీఫ్ ప్రాంతంలో మయన్మార్ నుంచి శరణార్థిగా వచ్చిన ఇబ్రహీంను పాతనేరస్తులు అతి దారుణంగా చంపేశారు. సెల్‌ఫోన్ విషయంలో ఏర్పడ్డ తగాదాతో ఆసిఫ్, ఖయ్యూం అనే వ్యక్తులు ఇబ్రహీంను కత్తులతో పొడిచేశారు. తాజాగా బాలాపూర్ ప్రాంతంలో రియాజ్ దారుణంగా హత్యకు గురికావడంతో మరోసారి నగరం ఉలిక్కిపడింది.



### కొరవడిన నిఘా...

ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో రౌడీషీటర్ల రోజు వారీ కార్యకలాపాలపై నిఘా కొరవడింది. దీంతో యథేచ్ఛగా వారు నేరాలకు పాల్పడుతున్నారు. వారి మధ్య ఉండే ఆధిపత్య పోరుతో అప్పుడప్పుడు రక్తపుటేరులు పారుతున్నాయి. అయితే రౌడీషీటర్లు ఎక్కడున్నారు..? వారి కార్యకలాపాలపై క్షేత్ర స్థాయి పెట్రోలింగ్ పోలీసుల నిఘా ఉండాలి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ విషయాన్ని మరిచిపోయింది. రౌడీషీటర్ల మానిటరింగ్ విభాగం పూర్తిగా స్తబ్దంగా ఉన్నది. ప్రస్తుతం ఎంత మంది రౌడీషీటర్లు యాక్టివ్‌గా ఉన్నారు..? రోజు వారీ కార్యకలాపాలు ఏమిటీ..? అనే నివేదికలు కూడా ఉన్నతాధికారులు తెప్పించుకోవడం లేదు. ఇలా పోలీసుల అలస్వతం కారణంగా నగరంలో రౌడీషీటర్లు మరింత రెచ్చిపోతున్నారనే ఆరోపణలున్నాయి.

### కారుతో ఢీకొట్టి.. కాల్పులు జరిపి



మీర్‌పేటలో నివాసముంటున్న రియాజ్ (45) రౌడీషీటర్. ఆర్‌సీఐ రోడ్డు నుంచి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, అతడి కదలికలను ప్రత్యర్థులు పసిగట్టారు. అతడి ద్విచక్రవాహనాన్ని కారుతో ఢీకొట్టి..కాల్పులు జరిపారు. రియాజ్ చనిపోయాడని నిర్ధారించుకున్నాక నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. రాచకొండ సీపీ సుధీర్ బాబు డీసీ సునీతారెడ్డి ఏసీపీ, లక్ష్మీకాంత్‌రెడ్డి సీఐ భూపతితో కలిసి ఘటనా స్థలిని పరిశీలించారు. క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేయించారు. రియాజ్ పై రౌడీషీట్ ఉందని, బాలాపూర్ పోలీస్ స్టేషన్ తో పాటు హైదరాబాద్‌లో పలు కేసులు ఉన్నాయని సీపీ తెలిపారు.



# యాక్షన్‌లోకి కమిషనర్..

**చెత్త నిర్వహణలో అలసత్వంపై ఆగ్రహం**

**10 మంది డిప్యూటీ కమిషనర్లకు షోకాజ్ నోటీసులు**

సిటీబ్యూరో, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ ) : గ్రేటర్‌లో ఇంటింటి చెత్త సేకరణ, జీవీపీ పాయింట్లు (తరచూ చెత్త వేసే ప్రాంతాల) ఎత్తివేతలో అలసత్వం ప్రదర్శిస్తున్న అధికారులపై కమిషనర్ ఆమ్రపాలి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కఠిన చర్యలకు కమిషనర్ ఉపక్రమించారు. కార్మికుల అటెండెన్స్ పారదర్శకంగా ఉండేందుకు ఇటీవల ఫేషియల్ రికగ్నైషన్ తీసుకొచ్చినా.. 100 శాతం అటెండెన్స్ లేకపోవడం, ఇంటింటి చెత్త సేకరణ సరిగా జరపకపోవడం, జీవీపీ పాయింట్ల ఎత్తివేతలో నిర్లక్ష్యం..అన్నింటికంటే పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు ఉందని పేర్కొంటూ.. 10 మంది డిప్యూటీ కమిషనర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 24 గంటల్లో వివరాలు ఇవ్వాలని సదరు ఉత్తర్వులో కమిషనర్ పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న వారిలో చార్మినార్, రాజేంద్రనగర్, మెహిదీపట్నం, కార్వాన్, ముషీరాబాద్, బేగంపేట, చాంద్రాయణ గుట్ట, ఫలక్‌నుమా తదితర సర్కిల్ డిప్యూటీ కమిషనర్లు ఉన్నారు. అయితే డీసీలతో పాటు క్షేత్రస్థాయిలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణలో అత్యధికంగా డీఈ, మెడికల్ ఆఫీసర్ల బాధ్యత కూడా ఉంటుంది. అయితే వీరిని కాదని కేవలం డీసీలకే షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

# కుక్కలా..క్రూర మృగాలా!

**ఒంటరిగా మనిషి కనిపిస్తే చాలు..**

**పైశాచికంగా దాడి..**

- చిన్నారుల ప్రాణాలు తీస్తున్న వైనం
- తాజాగా ఓ బాలుడి మర్మాంగాలను కొరికేసిన వీధికుక్కలు
- ప్రాణాపాయస్థితిలో బాలుడు

**నెలరోజుల కిందట కుక్కల దాడిలో గాయపడిన మరో బాలుడు చికిత్సపొందుతూ మృతి**



*వీధి కుక్కలు క్రూర మృగాలుగా మారుతున్నాయి. ఒంటరిగా మనిషి కనిపిస్తే చాలు..వెంబడించి దాడికి తెగబడుతున్నాయి. ముఖ్యంగా అభంశుభం తెలియని చిన్నారులపై విరుచుకుపడుతున్నాయి. వారి ప్రాణాలను తీస్తున్నాయి. వరుసగా జరుగుతున్న కుక్కల స్వైరవిహారంతో నగరవాసులు ఇప్పటికే బెంబేలెత్తిపోతున్నారు. తాజాగా ఓ ఇంట్లోకి చొరబడి మానసిక ఆరోగ్య స్థితి బాగోలేని బాలుడిపై కుక్కలు పైశాచికంగా దాడి చేసి..అతడి మర్మాంగాలను కొరికేశాయి. కలవరానికి గురి చేసిన ఈ ఘటన కోకాపేట సబితానగర్‌లో చోటుచేసుకున్నది.*

*-మణికొండ/ఇబ్రహీంపట్నం రూరల్/తెలుగు యూనివర్సిటీ*

బతుకుదెరువు కోసం మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వలస వచ్చి సబితానగర్‌లో ఉంటున్న రాజు, అంజమ్మ దంపతులకు ఇద్దరు పిల్లలు. కూలీనాలీ చేసుకుంటూ..కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. పెద్ద కుమారుడు భరత్(7) పుట్టిక నుంచే మానసిక అంగ వైకల్యంతో బాధపడుతూ..మంచానికే పరిమితమయ్యాడు. కాగా, శుక్రవారం ఉదయం ఇంట్లో మంచంపై నిద్రిస్తున్న భరత్‌పై వీధి కుక్కలు దాడికి పాల్పడ్డాయి. ఇంటి పక్కన వంట చేసుకుంటున్న తల్లి అంజమ్మ పిల్లాడి అరుపులు విని వచ్చేసరికి మూడు కుక్కలు బాలుడి మర్మాంగాలను కొరికేశాయి. తీవ్ర రక్తస్రావం కావడంతో బాలుడిని నార్సింగిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అపస్మారక స్థితిలో కొట్టుమిట్టాడుతున్న బాలుడి పరిస్థితిని గమనించిన వైద్యులు..వెంటనే ఆపరేషన్ చేశారు. రెండ్రోజులు గడిస్తే కానీ చెప్పలేమంటున్నారు. ఇదిలా ఉండగా, రోడెక్కితే డొక్కాడని.. జీవితాలు మావని.. వీధి కుక్కల దాడితో మరింత దయనీయ స్థితికి చేరుకున్నామని బాలుడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఆపరేషన్ కోసం వైద్యులు రూ. 30వేలు అడుగుతున్నారని, తమ వద్ద అంత డబ్బులు లేవని, సాయం చేయాలంటూ.. ఆస్పత్రికి వచ్చిపోయే వారిని వేడుకోవడం చూపరులను కంటతడి పెట్టించింది. అయితే ఆస్పత్రి వైద్యులు సైతం పెద్ద మనస్సు చాటుకున్నారు. ముందస్తుగా ఆపరేషన్ పూర్తిచేసి.. బాలుడి ప్రాణానికి ప్రమాదం జరుగకుండా చికిత్స అందిస్తున్నారు. ఇదిలా ఉంటే వారం రోజులు కిందట సబితానగర్ లోనే తన కుమారుడిపై అవే కుక్కలు దాడికి పాల్పడటంతో చికిత్స చేయిస్తున్నట్లు భరత్ పెద్దనాన్న నాగేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. వీధి కుక్కల వీరంగంపై స్థానిక నార్సింగి మున్సిపాలిటీ అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని వాపోయారు.

### చికిత్స పొందుతూ..బాలుడి మృతి



కియాన్ష్‌గౌడ్

ఇబ్రహీంపట్నంరూరల్/తెలుగు యూనివర్సిటీ ఆగష్టు 9 : ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్ పరిధిలోని రాయపోల్ గ్రామంలో కుక్కల దాడిలో గాయపడిన ఉడుతల శివకుమార్ మాధురి దంపతుల కుమారుడు కియాన్ష్‌గౌడ్ (4) చికిత్స పొందుతూ చనిపోయాడు. నెలరోజుల కిందట కుక్కల దాడిలో బాలుడికి కుడివైపు చెంపపై బలంగా గాయమైంది. వివిధ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. పరిస్థితి విషమించడంతో బాబును గురువారం నిలోఫర్‌కు తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం కియాన్ష్ చనిపోవడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

# బస్సుల కోసం సంతకాలు..!



గ్రేటర్‌లో ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలంటూ..సీపీఎం ఆధ్వర్యంలో 15 రోజులుగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి. బస్టాండ్‌లల్లో ప్రయాణికుల నుంచి సంతకాలు సేకరించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు లక్షల్లో ప్రయాణికులు సంతకాలు చేశారని సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. -సిటీబ్యూరో




**స్వచ్ఛదనం- పచ్చదనం** కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మల్కారం ఫారెస్టులో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ రంగారెడ్డి కలెక్టర్ శశాంకతో కలిసి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాలుష్యాన్ని నియంత్రించాలని పిలుపునిచ్చారు. -శంషాబాద్ రూరల్



# వైద్యవిద్య.. ప్రశ్నార్థకం

**ఉస్మానియా, గాంధీలో కాంట్రాక్ట్ వైద్యుల నియామకం**

**అనుభవజ్ఞులను ఇతర దవాఖానలకు బదిలీ చేయడంపై సర్వత్రా విమర్శలు**

సిటీబ్యూరో: ఉస్మానియా, గాంధీ దవాఖానలు...ఈ పేర్లు హైదరాబాద్‌కే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాలకు ఒక ఐకాన్. ఇక్కడ నగరవాసులు, తెలంగాణ వాసులే కాదు...దేశంలోని ఇతర రాష్ట్రాలకు చెందిన రోగులు కూడా పెద్ద సంఖ్యలో చికిత్స పొందుతుంటారు. అంతే కాకుండా ఉస్మానియా, గాంధీలో వైద్య విద్యనభ్యసించడం ఒక బ్రాండ్ ఇమేజ్‌గా పరిగణిస్తారు. ఇక్కడ వైద్య విద్యనభ్యసించిన ప్రముఖ క్యాన్సర్ వైద్యనిపుణులు నోరి దత్తాత్రేయ వంటి వారే కాకుండా.. ఎంతో మంది ప్రముఖ వైద్యులు ప్రపంచ వ్యాప్తంగా సేవలు అందిస్తున్నారు. అందుకనే పేరున్న వైద్యనిపుణులు నేటికీ వారి పేరు, చదివిన డిగ్రీల పక్కన ఉస్మానియా లేదా గాంధీ అని గర్వంగా పెట్టుకుంటారు. కార్పొరేట్‌లో కూడా జరగని క్లిష్టమైన శస్త్రచికిత్సలు ఎన్నో ఆ రెండు దవాఖానల్లో జరుగుతుంటాయి. 2016లో జరిగిన స్వీయ కాలేయ మార్పిడి శస్త్రచికిత్సనే ఇందుకు నిదర్శనం. ఇది అప్పట్లో ప్రపంచంలోనే రెండో ఆపరేషన్. దేశంలో మొదటిది. ఇలా చెప్పుకుంటూ పోతే గాంధీ, ఉస్మానియా దవాఖానలు ఎంతో మంది నిరుపేద రోగులకు పునర్జన్మను ప్రసాదించాయి. ఇంతటి పేరు, ప్రఖ్యాతలు ఉన్న ఈ దవాఖానలు, వైద్యకళాశాలలకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లను నియమించడంపై అటు రోగులు, ఇటు వైద్య విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉస్మానియాలో 8 మంది ప్రొఫెసర్లు, 23 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 111 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 33 మంది సీనియర్ రెసిడెంట్ డాక్టర్లను కాంట్రాక్ట్ పద్ధతిన నియమించేందుకు ఈనెల 6న ప్రభుత్వం నోటిఫికేసన్ విడుదల చేసింది. గాంధీలో ముగ్గురు ప్రొఫెసర్లు, 29 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 29 మంది సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు, నలుగురు ట్యూటర్లను కాంట్రాక్ట్ పద్ధతిన నియమించేందుకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. శుక్రవారం దరఖాస్తు చేస్తున్న వైద్యులకు ఇంటర్వ్యూలు ప్రారంభించారు.

### రోగులు లేని చోటకు అనుభవజ్ఞులా...?

ఉస్మానియా, గాంధీల్లో పనిచేస్తున్న అనుభవజ్ఞులైన వైద్యులను పెద్దగా రోగులు లేని దవాఖానలు, వైద్య కళాశాలలకు బదిలీ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం వేల సంఖ్యలో ఓపీ, ఐపీ రోగులు చికిత్స పొందే ఈ దవాఖానల్లో అనుభవజ్ఞులైన డాక్టర్లను బదిలీలపై పంపించి.. కాంట్రాక్ట్ పద్ధతిలో వైద్యులను నియమిస్తున్నారు. వైద్యసిబ్బంది సంఖ్య పెంచడం సబబే అయినా.. కీలకమైన పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన నియమించడంపై విమర్శలొస్తున్నాయి.

# 465 కాలనీల్లో ఉచిత వైద్య శిబిరాలు

సిటీబ్యూరో, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ ): వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణ కోసం జీహెచ్ఎంసీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ మేరకు నగరంలో సీజనల్ వ్యాధుల నివారణకు అవగాహన కార్యక్రమాలతో పాటు పెద్ద ఎత్తున ఉచిత హెల్త్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నది. గ్రేటర్ వ్యాప్తంగా 108 వార్డుల్లోని 465 కాలనీల్లో జిల్లా వైద్య ఆరోగ్య, జీహెచ్ఎంసీ సంయుక్తంగా వైద్యశిబిరాలను ఏర్పాటు చేశామని, గుర్తించిన హాట్ స్పాట్‌లలో వ్యాధి సోకిన ప్రజలకు చికిత్స అందిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరాలు 15 వరకు ఉంటాయని వెల్లడించారు. హాట్ స్పాట్‌లలో 345 మందికి డెంగీ, ఒకరికి మలేరియా వ్యాధి సోకినట్లు తెలిపారు